నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: ఇబ్రహీంబాగ్, నార్సింగి సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మంచిరేవుల, మంత్రి విల్లాస్, గ్రీన్ ల్యాండ్స్, జైహింద్ కాలనీలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు నార్సింగి ఏఈ మణికంఠ తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, పాషకాలనీ, అలిజాపూర్, ఈవీవీ కాలనీ, ఫెయిర్ ఫీల్డ్ కాలనీ, ఇబ్రహీంబాగ్ గ్రామంలో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

నగరానికి చేరుకున్న ఉమ్రా యాత్రికులు



శంషాబాద్: 14 రోజుల ఉమ్రా యాత్రను పూర్తి చేసుకున్న యాత్రికులు బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు చెందిన 50మందికి పైగా ఉమ్రా యాత్రకు వెళ్లి వచ్చారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు వారికి శాలువాలతో సత్కరించి పూలమాలలు వేసి స్వాగతం పలికారు.

మాజీ సర్పంచ్ అంతయ్య గౌడ్ మృతి



బుర్ర అంతయ్యగౌడ్ పటేల్(ఫైల్)

బండ్లగూడ: బండ్లగూడ మొదటి సర్పంచ్ బుర్ర అంతయ్యగౌడ్ పటేల్(95) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. బండ్లగూడ జాగీరు మొదటి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టడంతో పాటు ఎనిమిది సార్లు సర్పంచ్‌గా, 10 సార్లు ఉపసర్పంచ్‌గా ప్రజలకు అనేక సేవలు చేశారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన అంత్యక్రియలు గురువారం బండ్లగూడలో జరగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

డీఎస్‌యూ నూతన కార్యవర్గం



నూతన అధ్యక్షుడు రమేష్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని దళిత విద్యార్థి సంఘం (డీఎస్‌యూ) నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. డీఎస్‌యూ హెచ్‌సీయూ నూతన అధ్యక్షుడిగా తుంగ రమేష్, కార్యదర్శులుగా బైకి శేఖర్, విరున్ కొత్తూరిని ఎన్నుకున్నట్లు వారు ప్రకటించారు. డీఎస్‌యూ సీనియర్ నాయకుడు కన్వీనర్‌గా వేణురాథనోళ్ళ అధ్యక్షత వహించగా సమావేశంలో కుమార్‌రాజా, ఉమేష్ అంబేద్కర్, వర్ధన్‌తేజ, మనోజ్, రాజేందర్, నాగరాజు, కవిత, శిల్ప, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల తీరు మారాలి

రాయదుర్గం: గచ్చిబౌలి హెచ్‌సీయూ క్యాంపస్‌లో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ సిల్వర్ జూబ్లీ, హెచ్‌సీయూ గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో ' ఫ్రీడమ్, ప్రాస్పర్టీస్ అండ్ ఇన్‌క్లూజన్' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.

ముఖ్యఅతిథిగా లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాశ్‌నారాయణ్ హాజరై మాట్లాడారు. రాజకీయ పార్టీల వ్యవహార శైలి మారాలని, ప్రజలకు పనికొచ్చే పనులే చేయాలని ఆయన సూచించారు. ఎన్నికలలో సమగ్రమైన హామీలే ఇవ్వాలన్నారు.

హెచ్‌సీయూలో బైక్‌ర్యాలీ



రాయదుర్గం: శివాజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకొని హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్ చౌక్ నుంచి కార్గిల్ చౌక్ వరకు నార్త్ షాపింగ్ కాంప్లెక్స్ నుంచి సౌత్ షాపింగ్ కాంప్లెక్స్ వరకు ర్యాలీ సాగింది.

అధ్వాన రోడ్లతో అవస్థలు

- కాచారం-జూకల్-పిల్లోనిగూడ మార్గంలో వాహనదారులకు తప్పని ఇబ్బందులు



జూకల్-పిల్లోనిగూడ మధ్యలో గుంతలు పడిన రోడ్డు

శంషాబాద్ రూరల్: గుంతలు పడిన రోడ్డు.. కంకరతేలిన మార్గంలో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని కాచారం నుంచి పిల్లోనిగూడ వెళ్లే దారి అధ్వానంగా మారింది. జూకల్ మీదుగా ఉన్న ఈ రోడ్డులో భారీ గుంతలు వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. బెంగళూరు జాతీయ రహదారి-షాబాద్ రహదారిని అనుసంధానం చేసే ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

నిధులు మంజూరైనా.. పనుల్లో జాప్యం..

కాచారం నుంచి జూకల్ మీదుగా పెద్దషాపూర్ వరకు రోడ్డు విస్తరణ పనుల కోసం నిధులు మంజూరయ్యాయి. అయితే జూకల్-పెద్దషాపూర్ మధ్యలో రోడ్డు పనులు పూర్తి చేశారు. కాచారం-జూకల్ మధ్యలో రోడ్డు విస్తరణ పనులు ఇంకా ప్రారంభించలేదు. కాచారం గ్రామం వద్ద కొద్ది దూరం సీసీ రోడ్డు మాత్రమే వేశారు. ఇక జూకల్ నుంచి పిల్లోనిగూడ వరకు కూడా రోడ్డుకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ మార్గాలో రోడ్డు గుంతలు పడి కంకర తేలింది.

ప్రమాదకరంగా మూలమలుపులు..

కాచారం-పిల్లోనిగూడ దారిలో ఉన్న మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రి వేళల్లో ప్రయాణం చేయడానికి వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ఇటువైపు కొత్తగా ప్రయాణించే వారు ప్రమాదాలకు గురికావాల్సి వస్తుంది. దారికి ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు, ముళ్ల పొదలతో మరింత ఇబ్బంది ఎదురవుతుంది.

రైల్వే పనులతో పెరిగిన రద్దీ..

పాల్మాకుల-పిల్లోనిగూడ మధ్యలో జూకల్ రైల్వే క్రాసింగ్ వద్ద అండర్‌పాస్ పనులు కొనసాగుతున్నాయి. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలను రెండు నెలల నుంచి నిలిపివేశారు. కొత్తూరు మండలంలోని గూడూరు, మక్తంగూడెం వాసులతో పాటు పిల్లోనిగూడ, అచ్చంపేట గ్రామస్తులు జూకల్ దారి గుండా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ దారి అధ్వానంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు.

పెంచిన ఇంటి పన్నులు తగ్గించాలి



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న తిరుమల హిల్స్ కాలనీ ప్రెసిడెంట్ హరీష్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పెంచిన ఇంటి పన్నులను తగ్గించాలని తిరుమల హిల్స్ కాలనీ ప్రెసిడెంట్ హరీష్‌గౌడ్ కోరారు. ఈ మేరకు బుధవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గంధంగూడలోని తిరుమల హిల్స్ కాలనీలో అనధికారిక నిర్మాణాలు పేరుతో వేస్తున్న టాక్స్‌లను తగ్గించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ బండ్లగూడ జాగీరు మున్సిపల్ కమీషనర్ శరత్‌చంద్రకు ఫోన్‌చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

ఐకమత్యంతోనే సమస్యల పరిష్కారం



సీఐటీయూలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న జిల్లా కార్యదర్శి చంద్రమోహన్

మైలార్‌దేవ్‌పల్లి: కార్మికులు తమ సమస్యల పరిష్కారంలో ఐకమత్యంగా ఉండాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. కాటేదాన్ ఇండస్ట్రియల్ ఐలా కార్మికులు ఏఐటీయూసీ నుంచి సీఐటీయూలో చేరారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన యూనియన్‌లో చేరిన కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు యాజమాన్యాలు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. సీఐటీయూ కాటేదాన్ ఇండస్ట్రీ ఏరియా కన్వీనర్ జాజాల రుద్ర కుమార్, ఇండస్ట్రియల్ ఏరియా ఐలా కార్మికులు ఉమా, బాబు పాల్గొన్నారు.

గంగారం, పటేల్‌కుంటలను అభివృద్ధి చేస్తాం



అధికారులతో కలిసి చెరువును పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

- జెడ్‌సీ ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి: మల్కంచెరువు తరహాలో చెరువులను అభివృద్ధి చేస్తామని జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆయన పటేల్‌కుంట, గంగారం చెరువులను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ శేరిలింగంపల్లి జోన్ పరిధిలో గంగారం, పటేల్‌కుంట చెరువులను హెచ్‌ఎండీఏ నిధులతో తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలను రూపొందించాలని అధికారులకు ఆయన సూచించారు. అధికారులు విలువైన స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా దృష్టి పెట్టాలని చెరువుల పరిసరాలలో నిర్మాణ, వ్యర్థాలు వేయకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ రవి, డీఈ దుర్గాప్రసాద్, ఇరిగేషన్ డీఈ నళిని, హెచ్‌ఎండీఏ అధికారులు పాల్గొన్నారు.

దుర్గం చెరువు పరిశీలన

శేరిలింగంపల్లిలోని దుర్గంచెరువును జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి తనిఖీ చేశారు. మురుగునీరు చెరువులో చేరకుండా చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై సమీక్షించారు. చెరువు పరిసరాలలోని ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు చెరువులోకి చేరకుండా పైప్‌లైన్ల ద్వారా డ్రైనేజీలకు అనుసంధానించుకునేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. హెచ్‌ఎండీఏ సీఈ రవీందర్, డిప్యూటీ శివకుమార్‌రెడ్డి, ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ నళిని, ఏఈ పావని, డీసీ ముకుందరెడ్డి, ఎలక్ట్రికల్ ఈఈ మల్లికార్జున్, వైద్యాధికారి చంద్రశేఖర్, ఎంటమాలజీ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను ఉద్యోగులుగా గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి కె.యేసు రత్నం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ ఏఆర్. దేవరాజ్ భవన్ కార్యాలయంలో బుధవారం తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి కె.యేసు రత్నం హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని... కార్మికులను పర్మినెంట్ చేసేంత వరకు కనీస వేతనాలు రూ.26 వేలు అమలు చేయాలన్నారు. ముఖ్య కార్యకర్తల సమావేశం ఈ నెల 21న బుద్వేల్ ఏఆర్ దేవరాజ్ భవన్ ఏఐటీయుసీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి టి.ఆనంద్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

మైలార్‌దేవ్‌పల్లి: అన్ని వర్గాల సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమవుతుందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌కు చెందిన 200మందికి పైగా కాంగ్రెస్, ఎంఐఎం నాయకులు, మహిళా కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డితో కలిసి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్వేర్, వహాజ్, ఫరూక్, మోహిన్, ఖాన్, మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్, రాముయాదవ్ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న సబితాఇంద్రారెడ్డి, కార్తీక్‌రెడ్డి

వేర్వేరు కారు ప్రమాదాలు.. నలుగురికి గాయాలు



సీబీఐటీ వద్ద డివైడర్ మధ్యలో ఉన్న హోర్డింగ్ పోల్‌ను ఢీ కొట్టిన కారు

మణికొండ: బుధవారం జరిగిన వేర్వేరు కారు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. నార్సింగి పోలీసులు తెలిపిన మేరకు.. రామచంద్రాపురం మండలం, తెల్లాపూర్‌కు చెందిన విజయ్‌కుమార్ ఐటీ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. తన స్నేహితురాలితో కలిసి బుధవారం తెల్లవారు జామున సుజికీ బ్రాంక్స్ కారులో కోకాపేట మూవీటవర్ వైపు లాంగ్ డ్రైవ్‌కు వచ్చారు. కారును వేగంగా నడపటం, ముందు లారీ వెళుతున్న విషయాన్ని గమనించకపోవటంతో వెనక నుంచి ఢీకొట్టాడు. దాంతో విజయ్‌కుమార్‌తో పాటు అతని స్నేహితురాలికి గాయాలయ్యాయి. వారిని సమీపంలోని కాంటినెంటల్ ఆసుపత్రికి చికిత్స కొరకు తరలించారు.

- మరో సంఘటనలో వోక్స్ వ్యాగన్ కారులో వికారాబాద్ నుంచి నార్సింగికి వస్తుండగా సీబీఐటీ కళాశాల ముందుకు రాగానే అదుపు తప్పిన కారు రోడ్డు మధ్యలో డివైడర్‌పై ఉన్న హోర్డింగ్ పోల్‌ను ఢీ కొట్టింది. దాంతో కారు ముందు బాగం పూర్తిగా నుజ్జు,నుజ్జు అయ్యింది. అందులో ఉన్న కార్తీక్, అభిషేక్‌రెడ్డిలకు స్వల్పగాయాలు కావటంతో వారు కారును అక్కడే వదిలి పారిపోయారు. రెండు కారు ప్రమాదాల కేసులను నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

స్పా ముసుగులో..

గచ్చిబౌలి: స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న నిర్వాహకుడు, ముగ్గురు విటులను అదుపులోకి తీసుకున్న సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శ్రీరాంనగర్ కాలనీలో స్టైలిష్ బ్యూటీ స్పా పేరిట వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్, గచ్చిబౌలి పోలీసులు బుధవారం దాడులు చేశారు.

నిర్వాహకుడు సత్యనారాయణ, విటులు శ్రీకాంత్, గోవిందరావు, అప్పారావులను అదుపులోకి తీసుకున్నారు. నలుగురు యువతులను రెస్క్యూ హోంకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి భెల్ ఎంఐజీ కాలనీ రామాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా హోమాలు, మన్యుసూక్త హోమం, పూర్ణాహుతి చేపట్టారు. అదే విధంగా చక్రస్నానం నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో కళాబజార్

రాయదుర్గం: విద్యార్థుల సృజనాత్మతక, నైపుణ్య, కళాత్మక ఆవిష్కరణల 'ఆర్ట్ సౌక్-2025'ను హెచ్‌సీయూలో సరోజినీనాయుడు స్కూల్ ఆఫ్ ఆర్ట్ అండ్ కమ్యూనికేషన్‌లోని ఫైన్ ఆర్ట్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 'ఆర్ట్' అంటే కళ అని, 'సౌక్' అంటే బజార్ అనే అరబిక్ పదం అని తెలిపారు. విద్యార్థులలో ఉన్న కళను ప్రోత్సహించడానికి వేదిక ఏర్పాటు చేశారు. ప్రతియేటా ఫైన్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనను నిర్వహిస్తారు. విద్యార్థుల పెయింట్‌లను, టెర్రకోట, సిరామిక్స్ శిల్పాలు, పేపియర్ మాచే మాస్కులు, స్టోన్‌వేర్, ఆభరణాలు తదితరాలను ప్రదర్శనలో ఏర్పాటు చేసినట్లు వివరించారు.





ఖానాపూర్‌లో శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న యువకులు



పుప్పాలగూడలో బీఆర్‌ఎస్ నాయకులు



బృందావన్ కాలనీలో ..

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి

మణికొండ: మరాఠా పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ఘనంగా నిర్వహించారు. కాషాయజెండాలతో ర్యాలీలు నిర్వహించారు. మణికొండ, పుప్పాలగూడ, నార్సింగి, మంచిరేవుల, ఖానాపూర్, వట్టినాగులపల్లి, గౌలిదొడ్డి తదితర గ్రామాలలో యువకులు ర్యాలీలు నిర్వహించి ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూల మాలలతో నివాళులు అర్పించారు.

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ బొడ్రాయి వద్ద వీర శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నర్సింగ్‌ముదిరాజ్, రాజిరెడ్డి, ప్రమోద్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. బృందావన్ కాలనీలో నిర్వహించిన వేడుకల్లో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పి.కార్తీక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు.



హైదర్‌గూడ చౌరస్తాలో..



దుర్గానగర్ చౌరస్తాలో ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ తదితరులు



బండ్లగూడ జాగీర్‌లో..